సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



కాంగ్రెస్ రావడం ఖాయం

రాహుల్ గాంధీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు.

- 8లో ▸



అంగన్‌వాడీల సమ్మెబాట

అంగన్‌వాడీ వర్కర్స్ తమ డిమాండ్ల సాధనకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.3 /23.1

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం చిరుజల్లులు కురియవచ్చు. సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక



మోర్తాడ్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఏర్గట్ల, మోర్తాడ్ మండలాల్లోని తడపాకల్, తాళ్లరాంపూర్, తిమ్మాపూర్, పాలెంలలోని లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు అందరు తన బిడ్డలే అని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు భావించి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇండ్ల నిర్మాణం చేసుకునే వారికి సాయం అందించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీలు కొలిప్యాక ఉపేంద్ర, శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యులు గుల్లె రాజేశ్వర్, బద్దం రవి, సర్పంచ్‌లు గుల్లె లావణ్య, ప్రకాష్‌రెడ్డి, భానుప్రసాద్, గడ్డం చిన్నారెడ్డి, ఏనుగు సంతోష్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సదరం స్లాట్ల సంఖ్య

- ప్రతి క్యాంప్‌కి 50 పెంపు

డొంకేశ్వర్(ఆర్మూర్) : దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు సదరం స్లాట్ల సంఖ్యను పెంచారు. గతంలో ప్రతి క్యాంప్‌కి 80 స్లాటను విడుదల చేస్తుండగా, అవి గంటలోపే ముగిసిపోతున్నాయి. దీంతో చాలా మంది దివ్యాంగులు ప్రతి నెలా మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' దినపత్రికలో గత నెల 6న కథనాన్ని ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించారు. ఒక్కో క్యాంప్‌కి 50 స్లాట్లు అదనంగా పెంచి వాటి సంఖ్యను 130కి పెంచారు. ప్రస్తుత సెప్టెంబర్ మాసంలో 13,20,27 తేదీల్లో సదరం శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు. మూడు క్యాంప్‌లకు కలిపి మొత్తంగా 390 స్లాట్లను విడుదల చేయనున్నారు. ఈ నెల 8న మీ సేవా కేంద్రాల్లో స్లాట్లను బుక్ చేసుకోవడానికి అవకాశముంది. ఐతే, ఆర్థో కేటగిరీకి అత్యధిక స్లాట్లు కేటాయించినట్లు తెలిసింది. మూడు క్యాంపులకు కలిసి 150 వరకు అదనపు స్లాట్లు పెరగడంతో చాల రోజులుగా స్లాట్లు దొరకని దివ్యాంగులకు స్లాటు దొరికే అవకాశం ఏర్పడింది. ప్రతి నెలా ఇదే పద్ధతిలో స్లాట్లు విడుదల చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఎస్సారెస్పీలోకి వరద నీరు

- 16 వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 59 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నుంచి 16 వరద గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా అంతేస్థాయి నీటి మట్టం ఉంది.

బోగస్ ఓట్ల కలకలం..

- బోధన్ నియోజకవర్గంలో కొత్తగా 8,669 దరఖాస్తులు
- ఒక్క ఏరియాలోనే 4,024 దాఖలు
- జిల్లా వ్యాప్తంగా ఇలాంటి వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఎంపీ అర్వింద్ లేఖ
- దొంగ ఓట్లపై కఠినంగా ఉండాలి..
- లేనిపక్షంలో ఈసీ తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్న ఎంపీ
- ఇప్పటికే బీఆర్‌ఎస్ నాయకులు దొంగ ఓట్లు చేరుస్తున్నారంటూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఫిర్యాదు



అధికార యంత్రాంగం చేపడుతున్న ఓట్ల నమోదు ప్రక్రియపై కాంగ్రెస్, బీజేపీలు ప్రత్యేక బృందాల ద్వారా సీరియస్‌గా దృష్టి పెట్టాయి. బోధన్‌లోని ఒక ప్రాంతంలో ఏకంగా 4,024 దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఎంపీ అర్వింద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు లేఖ రాశారు. నకిలీ ఓట్ల నమోదుకు బీఆర్‌ఎస్ కంకణం కట్టుకుని పనిచేస్తోందని ఎంపీ ఈ సందర్భంగా ఆరోపించారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలవుతున్న కొద్దీ రాజకీయ పార్టీల మధ్య వాతావరణం నువ్వా నేనా అనేవిధంగా తయారవుతోంది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అధికార బీఆర్‌ఎస్ పార్టీ దొంగ ఓట్లు విచ్చలవిడిగా నమోదు చేస్తోందంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చేపడుతున్న ఓట్ల నమోదు ప్రక్రియపై కాంగ్రెస్, బీజేపీలు ప్రత్యేక బృందాల ద్వారా సీరియస్‌గా దృష్టి పెట్టాయి. తాజాగా గురువారం ఎంపీ ధర్మపురి అర్వింద్ దొంగ ఓట్ల నమోదుపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు లేఖ రాశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నకిలీ ఓట్ల నమోదుకు బీఆర్‌ఎస్ కంకణం కట్టుకుని పనిచేస్తోందని ఎంపీ అన్నారు. బోధన్ నియోజకవర్గంలోని 246 పోలింగ్ బూత్‌ల పరిధిలో మొత్తం 8,669 కొత్త ఓట్ల నమోదు కోసం దరఖాస్తులు రాగా, అందులో బోధన్ పట్టణంలోని ఒక్క ప్రాంతంలోని 8 బూత్‌ల పరిధిలోనే ఏకంగా 4,024 దరఖాస్తులు నమోదు అయిన విషయాన్ని ఎంపీ అర్వింద్ ప్రస్తావించారు. జూలై 20 నుంచి సెప్టెంబర్ 5 వరకు బీఆర్‌ఎస్‌కు చెందిన వారు ఈ ప్రక్రియ నడిపించినట్లు పేర్కొన్నారు.

మహారాష్ట్ర ప్రాంతాల నుంచి..

మహారాష్ట్రలోని ధర్మాబాద్, బిలోలి ప్రాంతాలకు చెందిన మైనారిటీ వర్గాల వారిని బోధన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ వారు అక్రమంగా ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఎంపీ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొన్ని మీసేవ కేంద్రాల ద్వారా దొంగ ఓట్లు నమోదు చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. బోధన్‌లోని రెండు కేంద్రాల్లో, నిజామాబాద్ నగరంలోని మరో కేంద్రం ద్వారా బోగస్ ఓట్ల దరఖాస్తులు చేస్తున్నట్లు పక్కా సమాచారం ఉన్నట్లు ఎంపీ తెలిపారు. ఇలాంటి మీసేవ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయడంతో పాటు, ఈ ప్రక్రియ వెనుక ఉన్న సూత్రధారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా క్షుణ్ణంగా పరిశీలించాలని, అన్ని నియోజకవర్గాల్లో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. అనర్హులను ఓటర్ల జాబితాలో చేర్చితే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు కలెక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీ అర్వింద్ లేఖలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఫిర్యాదు..

అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దొంగ ఓట్లు నమోదు చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ నెల 5న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 3న నిజామాబాద్ అర్బన్ పరిధిలోని మాలపల్లి వద్ద 261 పోలింగ్ కేంద్రం పరిధిలో కొందరు వ్యక్తులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 2021 ఓటరు జాబితాలు పట్టుకుని వ్యవహారం నడుపుతున్న కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఘటన కలకలం రేపింది. దీంతో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు, పార్టీ ఎన్నికల కమిటీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జి నిరంజన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి నకిలీ ఓట్ల వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. నకిలీ ఓట్ల రాకెట్‌పై సమగ్ర పారదర్శక విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.





కృష్ణుడు, రాధ ప్రతిమతో ఉయ్యాల



ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

- ఉట్టి కొట్టిన యువకులు
- ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికం, సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాలో గురువారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని ఇస్కాన్ కంఠేశ్వర్, ఇస్కాన్ ద్వారక్‌నగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. భజన్, కీర్తన్, నగర సంకీర్తన, సాంస్కృతిక, ఉట్టి కొట్టె కార్యక్రమాలు జరిగాయి. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - నిజామాబాద్ సిటీ



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జిల్లాలో విస్తారంగా వర్షాలు

22.5 మి.మీ సగటు వర్షపాతం నమోదు



సుభాష్‌నగర్ : వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై కొనసాగుతోంది. మూడ్రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటగిరి మండలంలో 48.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షాలతో ఈ సీజన్‌లో జిల్లాలో 30 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 3 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గురువారం మధ్యాహ్నం తర్వాత మూడు గంటల పాటు చల్లని గాలులతోపాటు వర్షం కురిసింది. రాగల రెండ్రోజులు జిల్లావ్యాప్తంగా అక్కడక్కడ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

మండలాలు	వర్షపాతం						
						సాలూర	37.0
వేల్పూర్	12.2	ఆలూరు	30.3	మాక్లూర్	38.2	ఎడపల్లి	35.4
జక్రాన్‌పల్లి	37.5	డిచ్‌పల్లి	19.4	మెండోరా	12.5	రుద్రూరు	29.0
నవీపేట్	26.3	కోటగిరి	48.3	ఇందల్వాయి	12.2	చందూరు	32.5
భీమ్‌గల్	15.4	ఏర్గట్ల	14.5	ఆర్మూర్	14.5	నిజామాబాద్‌రూరల్	23.7
మోర్తాడ్	14.7	రెంజల్	17.2	ధర్పల్లి	11.4	నిజామాబాద్‌నార్త్	35.5
సిరికొండ	28.6	పోతంగల్	43.8	ముప్కాల్	10.5	మోస్రా	21.0
బాల్కొండ	10.0	వర్ని	33.6	బోధన్	22.3	నిజామాబాద్‌సౌత్	25.3

అర్బన్‌కే చైర్మన్‌గిరి!

- నామినేటెడ్ పోస్టులపై ఎమ్మెల్యేల ఏకాభిప్రాయం మేరకే..
- బీసీ నాయకుడి పేరు ఖరారు.. అధికారిక ప్రకటనే తరువాయి
- త్వరలో కొలువుదీరనున్న నిజామాబాద్ మార్కెట్ కమిటీ పాలకవర్గం



సుభాష్‌నగర్ : రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్ కమిటీల్లో ఒకటైన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటించనుంది. నగరానికి చెందిన ఓ బీసీ నాయకుడికి చైర్మన్ పదవిని ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నామినేటెడ్ పోస్టులపై ఎమ్మెల్యేల ఏకాభిప్రాయం మేరకు చైర్మన్ పదవి అర్బన్‌కు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు పోస్టులకు ఎమ్మెల్యేలు తమ అనుచరులను నియమించుకున్నారు. సుమారు నాలుగున్నరేళ్ల తర్వాత మార్కెట్ పాలకవర్గం కొలువుదీరనుంది. గతంలో పలువురు చైర్మన్ పదవికి పోటీ పడినప్పటికీ.. ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేక వాయిదా పడుతూ వచ్చింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నామినేటెడ్ పోస్టులను నియోజకవర్గ, సామాజికవర్గాల ఆధారంగా ఎమ్మెల్యేలు ఆచితూచి భర్తీ చేస్తున్నారు.

నాలుగున్నరేళ్లుగా పర్సన్ ఇన్‌చార్జి..

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గడువు ముగిసి నాలుగున్నరేళ్లు గడిచింది. అప్పటి నుంచి పర్సన్ ఇన్‌చార్జి పాలనలో మార్కెట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ల పద్ధతిని అమల్జేస్తుంది. మొదటిసారి బీసీ మహిళకు అవకాశం రావడంతో 2017 జూన్‌లో డిచ్‌పల్లికి చెందిన కులాచారి దివ్య దినేష్‌కు అవకాశం కల్పించారు. మరో ఆరునెలల పాటు గడువు పొడగించారు. 2019 మార్చి నుంచి పర్సన్ ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతోంది. రిజర్వేషన్ల ప్రకారం రెండోదఫా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనరల్ కేటగిరికి కేటాయించారు.

ఏకాభిప్రాయానికి రావడంతోనే..

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి నవీపేట్, మాక్లూర్, నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్‌పల్లి, నందిపేట్‌తోపాటు నిజామాబాద్ అర్బన్ ఇలా నాలుగు నియోజకవర్గాలకు విస్తరించి ఉంది. నలుగురు ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రి, ఎమ్మెల్సీ ఏకాభిప్రాయానికి రాకపోవడంతోనే పాలకవర్గ ప్రకటన జాప్యమౌతోంది. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల పంపకాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఈసారి చైర్మన్ పదవిని అర్బన్ నియోజకవర్గానికి కేటాయించాలని ఎమ్మెల్యే పట్టుబట్టారు. జనరల్ కేటగిరికి కేటాయించినా.. బీసీ నాయకుడికి అవకాశమివ్వాలని నిర్ణయించారు. ఆమేరకు అధికారిక ప్రకటన మాత్రమే మిగిలి ఉంది.

వారం రోజుల్లో ప్రకటించే అవకాశం..!

మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని వారం రోజుల్లో ప్రకటించే అవకాశముందని పార్టీ నాయకులు, మార్కెట్ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే అర్బన్ ఎమ్మెల్యే ఓ బీసీ నాయకుడి పేరు ప్రతిపాదించారని, వైస్ చైర్మన్ కూడా అర్బన్ నియోజకవర్గం నుంచి ఉంటారనే చర్చ జరుగుతోంది. 12 మంది రైతులు డైరెక్టర్లుగా, ఇద్దరు వ్యాపారులు, నలుగురు అధికారులు పాలకవర్గంలో ఉంటారు. ఈసారి నుంచి పాలకవర్గం రెండేళ్లపాటు కొనసాగనుంది.

పట్టాలెక్కనున్న కొత్త రైల్వేలైన్..!

- ఆదిలాబాద్–పటాన్‌చెరు మార్గానికి అడుగులు
- 317 కి.మీ. లైన్‌కు రూ. 5,706 కోట్లతో అంచనా
- ఉమ్మడి జిల్లాకు ఎంతో ప్రయోజనం



సాక్షి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లా మీదుగా కొత్త రైల్వేలైన్ పట్టాలెక్కనుంది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వేలైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వేకు పచ్చజెండా ఊపింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని నాగలపల్లి నుంచి నిర్మల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, రుద్రూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, నిజాంసాగర్, అల్లాదుర్గ్, సంగారెడ్డి, మీదుగా పటాన్‌చెరుకు 317 కిలోమీటర్ల రైల్వే లైన్‌కు రూ. 5,706 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. దీంతో రైలు కూత తెలియని కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల ప్రజలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఆయా ప్రాంతాల ప్రజలు దూర ప్రాంత ప్రయాణాల కోసం రైలు ఎక్కాలంటే నిజామాబాద్, కామారెడ్డి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్త రైల్వే మార్గం అయిన తరువాత అక్కడి నుంచే ఎక్కడికైనా వెళ్లే అవకాశం రానుంది. కాగా బోధన్‌కు రైల్వేలైన్ ఉన్నప్పటికీ ఒక్క రైలు మాత్రమే అందుబాటులో ఉంది. కొత్తగా రైల్వేలైన్ నిర్మించడం మూలంగా ఉమ్మడి జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుంది. జుక్కల్, బాన్సువాడ ప్రాంతం నుంచి చాలా మంది బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వెళ్తుంటారు. రైల్వే సౌకర్యం ఏర్పడిన తర్వాత రాకపోకలకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటికే హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు రైల్వే మార్గం ఉంది. ఇటీవలే రైల్వేలైన్ విద్యుద్దీకరణ కూడా జరిగింది. అలాగే ఈ మధ్యే డబుల్ లైన్ కూడా మంజూరైంది. కామారెడ్డి రైల్వేస్టేషన్ మీదుగా యాభైకి పైగా రైళ్లు నడుస్తున్నాయి. అటు హైదరాబాద్ వైపు, ఇటు నిజామాబాద్ వైపు నిత్యం వందలాది మంది ప్రయాణాలు చేస్తున్నారు.

పంట ఉత్పత్తుల రవాణా సులువు

ఉమ్మడి జిల్లాలో పంట ఉత్పత్తుల రవాణాకు రైల్వే లైన్లతో ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే కామారెడ్డి, నిజామాబాద్ రైల్వే స్టేషన్ల ద్వారా పంట ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి. కొత్త రైల్వేమార్గం ఏర్పాటైతే అటు ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే పసుపు, జొన్నలు, మక్కలను ఇతర ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగపడుతుంది. బాన్సువాడ, రుద్రూర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి సాగవుతున్నందు న బియ్యాన్ని రవాణా చేయడానికి రైల్వే లైన్‌తో మేలు జరుగుతుంది. జుక్కల్ నియోజకవర్గంలో పప్పు దినుసులు, సోయా వంటి పంట ఉత్పత్తులు రవాణాకు ఉపయోగపడుతుంది.

చౌకగా.. సౌకర్యవంతంగా..

అలాగే తిరుపతి, విశాఖ, విజయవాడ, రాజమండ్రి, వరంగల్, అన్నవరం, షిర్డీ, ముంబయి తదితర ప్రాంతాలకు రైళ్లు ఉండడంతో నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, షిర్డీకి ప్రతినిత్యం రైళ్లు ఈ మార్గం గుండా నడుస్తుండడంతో చాలా మంది రైళ్లలో వెళ్లి వస్తున్నారు. రైళ్లో ప్రయాణం సురక్షితంగా, సౌకర్యంగా వెరసి తక్కువ చార్జీలతో వెళ్లి రావచ్చనే ఉద్దేశ్యంతో చాలామంది రైళ్లలోనే ప్రయాణం చేస్తుంటారు. 44వ నంబరు జాతీయ రహదారి (బెంగుళూరు–నాగ్‌పూర్), 161 వ నంబరు జాతీయ రహదారి (సంగారెడ్డి–నాందేడ్–అకోలా), కొత్తగా హైదరాబాద్ నుంచి మెదక్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బైంసా రూట్లో జాతీయ రహదారి కూడా మంజూరైంది. కరీంనగర్ నుంచి సిరిసిల్లా, కామారెడ్డి, ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు జాతీయ రహదారిగా గుర్తించారు. మంజూరు కావాల్సి ఉంది. ఇటు రోడ్డు, అటు రైల్వేలైన్ కనెక్టివిటీ మూలంగా ప్రజలకు రాకపోకలకు ఎంతో సులువుగా ఉంటుంది.

సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో నేరాలకు అడ్డుకట్ట

సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: సైబర్ ఆధారిత నేరాలను సమర్థవంతంగా కట్టడి చేసేందుకు ఏర్పాటైన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా నేరాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ సూచించారు. గురువారం జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ హ్యాకింగ్, ఫిషింగ్, సైబర్ భద్రత పై శిక్షణ పూర్తి చేసుకున్న పోలీస్ అధికారులతో సైబర్ మోసగాళ్ల ఆటకటించేలా ఈ విభాగం పకడ్బందీగా పనిచేస్తుందన్నారు. సైబర్ నేరాలకు పాల్పడేవారిని గుర్తించి, ఆయా రాష్ట్రాల సహకారంతో పట్టుకోవడం.. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, టెలికాం ఆపరేటర్ల నోడల్ ఏజెన్సీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును స్తంబింప చేయడం.. నకిలీ బ్యాంక్ ఖాతాలు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉన్న ఫోన్ నెంబరును గుర్తించి నియంత్రించడం.. పలుమార్లు నేరాలకు పాల్పడే అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ నిందితులను గుర్తించి చేధించడం వంటి కీలకమైనపాత్రను సైబర్ సెక్యూరిటీ బ్యూరో విభాగం పోషిస్తుందని తెలిపారు. భూతగాదాలు, చిట్ ఫండ్, రోడ్డు ప్రమాద, ఎక్సైజ్, వివాహ, కుటుంబ తగాదాలు, ట్రాఫిక్ కేసులకు సంబంధించి రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా చేసే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఈనెల 9న న్యాయస్థానాల్లో జరగనుండగా విజయవంతం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికలకు ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే నిర్వహణ సులభతరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్ పోస్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పోక్సో కేసుల్లో చార్జిషీట్ సకాలంలో దఖాలు చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎస్ జయ్ రామ్, ఏసీపీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ, డీసీపీ జయరామ్

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



రుద్రూర్: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నాగభూషణానికి చెందిన ఇల్లు కూలి పోయింది. మురికి కాల్వ వైపు గోడ పడడంతో ప్రాణాలతో బయట పడినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

14,15 తేదీల్లో అథ్లెటిక్స్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం:జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించను న్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ గురువారం తెలిపారు. ఈ నెల 14న అండర్–14, 16, 18, 20 విభాగం లో బాలబాలికలకు, 15న అండర్–8, 10, 12 విభాగంలో ఎంపికలు ఉంటాయన్నారు. ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో పోటీలు ఉంటాయని అన్నారు. విజేతలకు బహుమతులు అందజే స్తామన్నారు. రూ. 100 ఎంట్రీ ఫీజు ఉంటుంద న్నారు. మరిన్ని వివరాలకు 9989040776 నం బర్‌ను సంప్రదించాలన్నారు.

మొరం టిప్పర్లను అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండలం రాం పూర్ శివారులో మొరం టిప్పర్లను డీసీసీ కార్య దర్శి, కోటగిరి ఎంపీటీసీ మనోహర్ గురు వారం అడ్డుకున్నారు. సెలవు రోజుల్లో మొరం తరలించడం సరైంది కాదన్నారు. అనుమతి పత్రాలు లేకుండా మొరం తరలిస్తున్న టిప్ప ర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలం లోని అమ్రాబాద్ శివారులో ఉన్న అమ్రాబాద్ తండా, చంద్రునాయక్ తండాల్లో సుమారు ఐదెకరాల అటవీ భూమిలో చెట్లు నరికివేసి నట్లు అటవీశాఖ అధికారి మానస గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకుం టామని ఎస్సై పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఏడుగురి బైండోవర్

మండలంలోని ముదక్‌పల్లిశివారులో ఉన్న గుడి తండాకు చెందిన ఏడుగురిని తహసీల్దార్ ఖాజా ఖుద్బుద్దీన్ ఎదుట గురువారం బైం డోవర్ చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఒక్క సీసీ కెమెరా వం ద మంది పోలీసులతో సమానమని ఎస్పీ శ్రీని వాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోచారం తండాలో తండా వాసుల సహకారం తో రూ.లక్ష 55 వేలతో 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురువారం సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, వీటితో నేరాలను కట్టడి చేయవచ్చని చెప్పారు.

చేపల వేటతో మస్తు మజా..

- సరదా కోసమే గాలమేస్తామంటున్న స్థానికులు
- గాలానికి చిక్కుతున్న చేపలు



గాలానికి చిక్కిన చేపను తీస్తున్న యువకుడు



ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం వద్ద గాలం వేస్తున్న యువకులు

బాల్కొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ చుట్టూ ఉన్న కాలువలు, ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లోకి నీరు అధికంగా రావడంతో చేపలు పట్టేందుకు స్థానికులు ఆసక్తి చూపుతు న్నారు. చేపలు పట్టేందుకు ఎక్కువగా వలను ఉప యోగిస్తారు.. కానీ కొందరు తమ సరదా కోసమే గాలం వేస్తూ చేపలను పడుతున్నట్లు పేర్కొంటు న్నారు. దీంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు గాలం వేస్తున్న వారి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రధానంగా వరద కాలువ, పునరుజ్జీవన పథకం హెడ్ రెగ్యులేటర్‌పై నిలబడి గాలమేస్తున్నారు.

గాలానికి గోధుమ పిండి ఎర..

గాలం వేసే వారు సన్నని కర్రకు దారం కట్టి దాని చివరన సూది లాంటి పరికరాన్ని అమర్చుతారు. చేపలు గాలానికి చిక్కాలంటే ఎర వేయాల్సిందే. గతంలో వానపాములను చేపలకు ఎర వేసేవారు.. కానీ ప్రస్తుతం అధికంగా గోధుమ పిండిని ఉండలు కట్టి ఎర వేస్తున్నారు. ఇలా పలుమార్లు ఎరవేస్తే గాలానికి చేపలు చిక్కుతున్నాయని దీంతో మేము వాటిని సంతోషంగా ఇంటికి తీసుకెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు.

సరదాగా గాలం వేస్తాను



ప్రాజెక్ట్‌లోకి నీరు రావడంతో నిత్యం చేపల కోసం గాల వేస్తున్నాను. గాలం వేయడం నాకు అలవాటుగా మారిపో యింది. పరిసర ప్రాంతాల్లో నీరు ఎక్కువగా కనిపిస్తే గాలానికి పిండి కట్టి ఎరవేస్తున్నాను. చిన్న చేపలు పడడంతో సంతోషంగా పట్టుకొని ఇంటికెళ్తాను. గాలం వేయడం సంతోషంగా అనిపిస్తుంది.

–గౌస్, బాల్కొండ

ఏకాగ్రత పెరుగుతుంది..



గాలం వేయడంతో ఏకాగ్రత పెరుగుతుంది. అంతే కాకుం డా మానసిక ఒత్తిడి సైతం దూరమవుతోంది. గాలం వేసి నప్పుడు దృష్టి అంతా గాలం పైనే ఉంటుంది. అది నాకు ఒక అలవాటుగా మారిపోయింది. ప్రాజెక్టు ప్రాం తాల్లో ఇలా చేపలకు గాలం వేస్తూ పట్టుకుంటు న్నాను. ఒక్కసారికే చిక్కవు. పలుమార్లు వేస్తే ఒక్కటి చిక్కుతోంది.

–ఏతీషామొద్దీన్, బాల్కొండ

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



డిచ్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం ఖాయమని పార్టీ రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాథ్ జోడో కార్యక్రమం ఏడాది కాలం పూర్తయినందున టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట ఉన్న అం బేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనని వచ్చే ఎన్నికల్లో కాం గ్రెస్‌ను అధికారంలోకి రాకుండా కుట్రలు పన్నుతు న్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, టీపీసీసీ వైస్‌ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రైతు కిసాన్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పార్టీ మండల అధ్య క్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు పాలసాని శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, డీసీసీ డెలి గేట్స్ వాసు, ధర్మాగౌడ్, శ్యాంసన్, ప్రధాన కార్య దర్శి భాస్కర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, ఎల్లయ్య, సాయిరెడ్డి, యూత్ కాంగ్రెస్ శీనునాయక్, రాజన్న, వెంకటేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

కమ్మర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియో జకవర్గాల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన హాథ్ సే హాత్ జోడో కార్యక్రమం ఏడాది కాలం పూర్తయినందున మండల కేంద్రంలో కాంగ్రె స్‌పార్టీ నాయకులు నిర్వహించిన ర్యాలీకి మోహన్ రెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, పార్టీ మండలాల అధ్యక్షులు రవి, రాములు, ముత్యం రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక విక్రయంపై అధికారుల విచారణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్ పేటకు చెందిన ఓ మహిళ తన పెద్ద కుమార్తెను విక్రయించిందనే ఆరోపణతోపాటు చిన్న కుమార్తెను అక్రమంగా దత్తత ఇచ్చిన విషయమై జిల్లా బాలల సంరక్షణ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు సదరు మహిళ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. ఏడేళ్ల వయసు ఉన్న పెద్ద కుమా ర్తెను గతనెల 17న కొందరి మధ్యవర్తిత్వంతో బాలిక తల్లి రూ.30వేలకు లింగంపేట మండలం పోల్కంపేటకు చెందిన హుస్సేన్, సిద్దవ్వకు విక్ర యించినట్లు గుర్తించారు. దీంతోపాటు రెండేళ్ల వయసున్న చిన్న కుమార్తెను పుట్టిన 15 రోజులకే సమీప బంధువైన తాండూరు గ్రామంలోని భోగం కృష్ణకు దత్తత ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు జిల్లా బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది గజ్జల స్వామి నాగిరె డ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక విక్రయంతోపాటు అక్రమ దత్తతకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఘనంగా వివాహ వేడుక..

- ప్రముఖుల హాజరు



నిజామాబాద్‌నాగారం: నగర మేయర్‌దండు నీతూ కిరణ్‌శేఖర్ కుమార్ వివాహం కామారెడ్డిలో గురు వారం నిర్వహించారు. వధూవరులను ఎమ్మెల్సీ కవిత, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆశీర్వదించారు. నాయకులు,కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మిలాద్–ఉన్–నబీ నిర్వహించాలి

- సీపీ సత్యనారాయణ



ఖలీల్‌వాడి: రాబోయే మిలాద్–ఉన్–నబీని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీపీ సత్యనారాయణ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో సీపీ ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో డీసీపీ ఎస్. జయ్‌రామ్, ఏసీపీలు కిరణ్ కుమార్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్ రాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం,సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను తొలగించాలి

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్ నగర్ కాలనీలో అం గన్‌వాడీ స్కూల్ వెనుక ఉన్న బెల్ట్ షాపును తొలగిం చాలని సీపీఐ, కాలనీవాసులు గురువారం డిమాం డ్ చేశారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న స్థలానికి మద్యాన్ని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఐ అర్బన్ నియో జకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు బి.ర ఘురాం, సఖి, సురేశ్, కండ్ల కోయల గంగాధర్, కాలనీవాసులు శ్రీనివాస్, ప్రభంజన్ కె.రాజు, కె.పోశెట్టి, సంజు, మహిళా సంఘం నాయకులు మంజుల, గంగమ్మ, పద్మ పాల్గొన్నారు.



మద్యంను పోలీసులకు అప్పగిస్తున్న సీపీఐ, కాలనీవాసులు

ఉద్యోగుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బీఆ ర్ఎస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూర్ మండలాలకు చెందిన 8 మంది జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ ధ్రువపత్రాలను అందజేశారు. కలె క్టర్ జితేష్ వి పాటిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీ బొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు



ఇందల్వాయి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేసేందుకు అన్సాన్‌పల్లికి చెందిన ప్రదీప్‌రెడ్డి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో గురు వారం దరఖాస్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రదీప్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో అధికార పార్టీ ఓటమికి బీజేపీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు.

73 మంది కండక్టర్లు, డ్రైవర్లకు ఏడీసీలుగా పదోన్నతలు

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరు డిపోల్లోని 73 మంది కండక్టర్లు, డ్రైవర్లలకు అసిస్టెం ట్ డిపో క్లర్క్, ఆర్టీసీ కంట్రోలర్‌గా పదోన్నతలు కలి ్పంచినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి గురు వారం తెలిపారు. సీనియారిటీ బట్టి పదోన్నతులు కల్పించినట్లు చెప్పారు. గతంలో కంటే ఈ సారి ఎక్కువ పదోన్నతలు కల్పించడంపై ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

అలీసాగర్ నుంచి 350 క్యూసెక్కుల నీటి విడుదల



ఎడపల్లి(బోధన్): మండలంలోని అలీసాగర్ రిజ ర్వాయిర్ ఇటీవల కురిసిన వర్షానికి నిండుకుండలా మారింది. నిజాంసాగర్ ప్రధాన కెనాల్‌లోకి భారీ వరద చేరడంతో గురువారం అలీసాగర్ ఒక గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఎన్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్ జాదవ్



సునీల్ జాదవ్

సుభాష్‌నగర్: నేషనలిస్ట్ కాం గ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకేంద్రానికి చెందిన సునీల్ జాదవ్‌ను ఆ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసి డెంట్, ఎంపీ ప్రఫుల్ పటేల్ నియమించారు. ఈమేరకు నియామకపత్రాన్ని గురువారం అందజేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్, ఎంపీ ప్రఫుల్ పటేల్, జాతీయ కార్యదర్శి ఎస్ఆర్ కోహిలీ, మంత్రి ధర్మారావు బాబా ఆత్రంతో పాటు రాష్ట్ర కార్యవర్గసభ్యులం దరికీ సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

గోమాతకు అంత్యక్రియలు



సుభాష్‌న గర్: నగరం లోని వినా యక్‌నగర్‌లో మృతిచెందిన గోమాతకు విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి దాత్రిక రమేశ్ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహిం చారు. గోసేవకులు వినయ్, శేఖర్, నరేశ్ గౌడ్, మున్నా గౌడ్, కార్తీక్, శ్రావణ్‌గౌడ్, మనోహర్, సాయాగౌడ్ ఉన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 8188055849. [G-751670]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PUBLIC NOTICE

General Public are hereby informed that my client Sri. Konda Likhith Sai S/o. Konda Sanjeev, is absolute owner of the below mentioned schedule property through **Regd. Sale Deed No. 6775/2023**, obtained necessary documents in originals.

That my client lost the link document in original **Regd. Sale Deed No. 4797/2005**, while travel from Phulong X Road to Vinayaknagar, Nizamabad, on that lodged police complaint at P.S, IV-Town, Nizamabad, on 04.09.2023, issued certificate on 05.09.2023, stating that the original link document/s stated above is not traced out and while obtaining the loan from the bank/s/ financial institutions/ Sale to third parties, etc., intend to offer/Submit/give the certified copy of the same, along with other documents.

Therefore, call upon general public/financial institutions having any objections/charge/claim/right/ interest, in this regard may put forth any such claim or objections before the undersigned within 7 days from the date of this publication, failing which no claim/objections will be entertained.

SCHEDULE OF PROPERTY:

The Open Plot No.236, Ext.244.44 Sq.yds or 204.38 Sq.mts, lies in Sy.No.86,vide G.P.L.P No.20/2003, situated at GANGASTHAN PHASE-II, Goopanpally, Nizamabad (Mdl & Dist), within the Municipal limits of Nizamabad.

As Bounded by: North: 33'.0" Wide Road, South: Open Plot of E.Swarupa Rani, East: Plot. No.237 of B.Chandrashekar Reddy & others & West: Plot. No.235 of B.Chandrashekar Reddy & others.

Sd/- E. JAYASIMHA
LL.B Advocate, H.No.1-1-47,
Vinayak Nagar, Nizamabad.
503002. Cell No.9490242033.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి ఒకరి మృతి



రాజు మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(32) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తాడ్వాయిలో కూలి పనికి వెళ్లిన రాజు గడ్డి, దోమల మందును మాస్కు లేకుండా స్ప్రే చేయడంతో అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొం దుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

బీబీపేట: చేపలు పట్టడానికి చెక్‌డ్యాంలోకి వెళ్లిన వ్యక్తికి వల చుట్టుకొని మృత్యువాత పడ్డ సంఘటన గురువారం మండలంలోని శేరిబీబీపేట గ్రామంలో చేపలు పట్టేందుకు వెళ్లిన మల్లయ్య(60) వల చుట్టుకొని మృ తి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పూస మల్లయ్య కూడవెల్లి వాగులోని చెక్‌డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లగా కాళ్లకు వల చుట్టుకుందన్నారు. దీంతో డ్యాంలో మునిగి మృతి చెం దాడు. భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

మల్లారం అటవీ ప్రాంతంలో మరొకరు..

ఖలీల్‌వాడి: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మల్లారం అటవీ ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. నగరంలోని ఇంద్ర పూర్ కాలనీలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఆగ్గు రవి(35) చేపల వేటకు మల్లారం చెరువుకు వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో కాళ్లకు వల చుట్టుకోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. గమనించిన స్థాని కులు 101కు కాల్ చేయడంతో నిజామాబాద్ ఫైర్ రెస్క్యూటీం ఇన్‌చార్జి, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది మృతదేహాన్ని వెలికితీ శారు. ఆపరేటర్ లక్ష్మీనర్సయ్య, ఫైర్‌మన్లు అనిల్, జైపాల్, సాయిలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గిరిజాతి ఆవు మృతి



రాజంపేట: విద్యుదాఘాతంతో గిరిజాతి ఆవు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెం దిన కాసం రాము తన పంటపొలం వద్ద పశు వుల పాకలో గేదెలతో పాటు గిరిజాతి ఆవును పెంచుతున్నాడు. ఉదయం కురిసిన వర్షానికి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కరెంటు తీగ తెగి పడి ఆవుపై పడడంతో మృతి చెందింది. దీని విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఎడపల్లిలో వృద్ధురాలి అదృశ్యం



సాయవ్వ (ఫైల్)

ఎడపల్లి(బోధన్): మం డల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయవ్వ అనే వృద్ధురా లు అదృ శ్యమైనట్లు ఎస్సై విక్రం గురువారం తెలిపా రు. బుధవారం రాత్రి ఇం ట్లో నిద్రించిన సాయవ్వ గురువారం ఇంట్లో కనిపించ కపోడంతో కుమారుడు శం కర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారంలో చైతన్యస్కూల్ విద్యార్థి హయతి(6)ని బుధవారం సాయంత్రం ఢీకొన్న విశ్వశాంతి స్కూల్ బస్సు డ్రైవర్ మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు గురు వారం తెలిపారు. సీసీటీవీలో నేరం రుజువు కావ డంతో బస్సు సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్ పోలీసులతో రక్షణ

భిక్కనూరు: గుర్తుతెలియని లింక్‌ను ఓపెన్ చేసి డబ్బులు పంపి మోసపోయినట్లు గుర్తించిన బాధి తుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమా చారం అందించి తన నగదును కాపాడుకోగలి గాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సై సాయికు మార్ తెలిపిన వివరాల ప్రకారం.. కంచర్ల గ్రామా నికి చెందిన గొల్ల నవీన్ ఈనెల 5న తన వాట్సా ప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా రూ. 28,300 నగదు డిపాజిట్ చేసి మోసపోయినట్లు గుర్తిం చాడు. వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే వారు స్పందించి చర్యలు తీసుకోవడంతో యూపీఐ నం బర్ ఉన్న ఖాతాను హోల్డ్ చేయించారు. దీంతో ఆ డబ్బులు మోసగాళ్లకు చేరలేదు. ఎస్సై మాట్లా డుతూ.. నవీన్ తన చాకచక్యంతో వెంటనో పోలీ సులకు సమాచారం అందించడంతో మోసానికి సైబర్ నేరగాళ్ల మోసానికి గురికాలేదన్నారు. నవీన్ డబ్బులు త్వరలో ఆయన ఖాతాలో జమ అవు తాయని పేర్కొన్నారు.

భార్యపై అనుమానంతో మనస్తాపం చెంది..

- పురుగుల మందుతాగి భర్త ఆత్మహత్య
- 40 రోజులకు మృతదేహం లభ్యం



బాలనర్సయ్య(ఫైల్)

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన బాలనర్సయ్య(32) జీవితంపై విరక్తి చెంది ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. 40 రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడగా గురువారం మృత దేహం లభ్యమైంది. నిజామా బాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలనర్సయ్య భార్య కవిత అదే గ్రామానికి చెందిన అరుణ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయమై పలుమార్లు భార్య, భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో జీవితం పై విరక్తి చెందిన బాల నర్సయ్య జులై 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని గుట్టప్రాం తంలోకి వెళ్లి పురుగుల మందు సేవించి మృతి చెం దాడు. గురువారం ఆ ప్రాంతానికి వెళ్లిన పశువుల కాపరి కుళ్లిన మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు సమాచారమిచ్చాడు. బాల నర్సయ్యగా గుర్తించిన మృతుని తండ్రి వెంకటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుని భార్య కవితతో పాటు ఆమె ప్రియుడు అరుణ్ వ్యవహారంతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేయడంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



అఖిల్ (ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన అఖి ల్(27) ఉద్యోగం రాలేదనే బాధతో ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉద్యోగం రాలేదనే బాధతో అఖిల్ మద్యానికి బానిసైనట్లు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అతని భార్య తేజస్విని కుతూరు ఆద్యతో కలిసి పుట్టింటికి వెళ్లిం ది. బుధవారం రాత్రి తన గదిలో పడుకున్న అఖిల్ ఉదయం డోర్ తీయకపోవడంతో గమనించిన కుటుంబీకులు కిటికిలోంచి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తం డ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బహ్రెయిన్‌లో ఒకరు..



స్వామి(ఫైల్)

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఉపా ధి నిమిత్తం బహ్రెయిన్‌కు వెళ్లిన ఓ యువకుడు ఆత్మ హత్య చేసుకున్న ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మం డలంలోని గిద్ద గ్రామానికి చెందిన పల్లెల స్వామి (25) రెండు నెలల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ ఈ నెల 2న తన గదిలో ఆత్మహత్య చేసుకు న్నట్లు సమాచారం అందినట్లు తల్లిదండ్రులు కలవ్వ ధర్మయ్య తెలిపారు. కానీ తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అక్కడ ఏదో జరిగిందని ప్రజాప్రతినిధులు స్పందించి తమ కుమారుడి మృతికి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. స్వామి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని కుటుంబీకులు కోరారు.

పెళ్లిరోజే వరుడి మృతదేహం లభ్యం

- అడ్లూర్ ఎల్లారెడ్డిలో విషాదచాయలు



రాజేందర్‌రెడ్డి(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): పెళ్లి రోజే వరుడి మృతదేహం లభ్యమైన ఘటన సదాశివన గర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొసర్ల చిన్న నర్సింహులుకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన రాజేందర్‌రెడ్డి(29) వివాహం రాంపూర్‌కు చెందిన అమ్మాయితో గురువారం జరగాల్సి ఉంది. రాజేందర్‌రెడ్డి అన్న శ్యామ్‌రెడ్డి ఇద్దరు కలిసి పెళ్లి పత్రికలను ఇటీవల బంధువులకు పంచారు. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లిన రాజేంద ర్‌రెడ్డి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. స్థానికుల సమాచారం మేరకు లింగంపేట మండలం ఎల్లారం అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని రాజేందర్‌రెడ్డి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. లింగంపేట ఏఎస్సై ప్రకాశ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.